సాక్షి
కాకినాడ

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



...సత్తా చాటుతాం

బరువులెత్తుతాం.. సత్తా చాటుతాం అంటూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పవర్ లిఫ్టర్లు పోటాపోటీగా తలపడ్డారు. ఈ పోటీలకు అమలాపురం వేదికైంది.

8లో



సంస్కృతికి వేదాలు పట్టుగొమ్మలు

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు, ధర్మాలకు వేదాలు పట్టు కొమ్మలుగా నిలుస్తున్నాయని తెనాలి, రాజమహేంద్రవరం, టీటీడీ వేదిక్ వర్సిటీ వేదపండితులు తెలిపారు.

8లో

ఒక్క మాత్రతో నులిమేద్దాం..



నులి పురుగు.. ఈ మాట వినడానికి చిన్నగానే ఉన్నా మనిషికి కలిగించే అనారోగ్యం పెద్దదే. చిన్నారుల్లో రక్తహీనతకు, రోగాలకు కారణమవుతున్న నులి పురుగుల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నాయి.

8లో

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం




లోక్ అదాలత్‌లో కేసులు పరిశీలిస్తున్న లోక్ అదాలత్ చైర్‌పర్సన్ కమలాదేవి

కాకినాడలీగల్: జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కేసులు 441 కేసులు పరిష్కారమయ్యాయని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్‌పర్సన్ పి.కమలాదేవి తెలిపారు. ఈ లోక్ అదాలత్ బెంచ్‌లకు న్యాయమూర్తులుగా నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలాశ్యామ్ సుందరి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్నలక్ష్మి, మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి, నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నిరూప బాంజ్‌డియో, ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్, స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మీకుమారి, స్పెషల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి వ్యవహరించారు. ఇరు పక్షాలతో మాట్లాడి కేసులను పరిష్కరించారు.

27న జయలక్ష్మి సొసైటీ 3వ మహాసభ

కాకినాడ రూరల్: ది జయలక్ష్మి ఎంఏఎం కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ నూతన పాలక వర్గం ఆధ్వర్యంలో 3వ మహాజనసభ ఈనెల 27వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్టు చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు తెలియజేశారు. కాకినాడ దంటు కళాక్షేత్రం వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్న సమావేశానికి సభ్యులు హాజరు కావాలని శనివారం ఆయన కోరారు.

ఏలేరుకు స్వల్పంగా పెరిగిన నీరు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో ఏలేరు జలాశయంలో శనివారం నీటి నిల్వలు స్వల్పంగా పెరిగాయి. రెండు రోజుల నుంచి ప్రాజెక్టులో నీటినిల్వలు స్వల్పంగా పెరుగుతున్నాయి. పరీవాహక ప్రాంతం నుంచి 5,643 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులో చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 85.79 మీటర్లు, 24.11 టీఎంసీలకు 22.54 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దీంతో దిగువ ప్రాంతానికి 5,875 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పాటు విశాఖకు 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి

- ఘనంగా స్వామివారి ప్రాకార సేవ
- ఏకాదశి పర్వదినాన 40 వేల మంది భక్తుల రాక



ప్రాకార సేవలో తిరుచ్చి వాహనంపై వెళ్తున్న సత్యదేవుడు, దేవేరులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. భాద్రపద శుద్ధ ఏకాదశి సందర్భంగా సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, విశ్రాంతి మంటపాలు కిక్కిరిసిపోయాయి. ఆలయంలో మూడు వేల వ్రతాలు నిర్వహించగా, వివిధ విభాగాల ద్వారా స్వామివారికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఏకాదశి సందర్భంగా ఉదయం ఏడు గంటలకు స్వర్ణపుష్పార్చన, తొమ్మిది గంటల నుంచి ప్రత్యేక పూజలు, అనంతరం స్వామి వారికి వేదాశీస్సులు, అనంతరం ప్రసాదాలు నివేదించారు.

కన్నుల పండువగా ప్రాకార సేవ

ఉదయం పది గంటలకు తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అనంతలక్ష్మి, సత్యవతీదేవి అమ్మవార్లను ప్రతిష్ఠించి ప్రాకార సేవ ప్రారంభించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజనం సమర్పించి తిరిగి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు.



వీకే రాయపురంలో మునిగిన వరిచేలు



కిర్లంపూడిలో కుళ్లిన వరి పంటలు



గొల్లప్రోలులో దెబ్బతిన్న వరి పొలం

కష్టం కన్నీటిపాలు..

- నిండా ముంచిన ఏలేరు వరద
- దిక్కుతోచని స్థితిలో ఖరీఫ్ రైతులు
- ఎవరిని కదిపినా కన్నీళ్లే సమాధానం
- కుదేలైన ఆయకట్టుదారులు

ఎప్పుడూ పచ్చని పైర్లు.. జలజల పారే సాగునీటి కాలువలను చూసే అన్నదాత కళ్లు.. నేడు చెరువులైన చేలను.. బీభత్సంగా ప్రవహిస్తున్న వరద నీటని చూస్తున్నాయి. కష్టం కన్నీటి వరదై పారుతోందని రోదిస్తున్నాయి. అందరికీ అన్నం పెట్టే ఆ చేతులు నెత్తి కొట్టుకుని దేవుడా ఎందుకింత కాఠిన్యం చూపావయ్యా అని ప్రశ్నిస్తున్నాయి. ఎవరో వస్తారు.. సాయం చేస్తారు అని ఎదురుచూసే రోజులు పోయాయి.. గత ప్రభుత్వంలో సమయానుకూలంగా అందిన సాయాలు.. నష్ట పరిహారాలు.. గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- 'ఏపుగా దుబ్బు చేసిన పంటలు చూసి రేపోమాపో సిరులు కురిపిస్తాయని సంతోషపడ్డాం. గింజ పాలుపోసుకుని గట్టి పడే దశకు చేరుకున్న ఖరీఫ్ సాగును చూస్తే ముచ్చటేసింది. ఈ సీజన్ సిరులు కురిపిస్తుందని ఎంతో ఆశపడ్డాం. ఒక్క 30 రోజులు ఆగితే పంటలన్నీ బంగారమయ్యేవి.'
- 'పంటలు బాగున్నాయి. ఈ సారి అప్పులు కూడా తీరిపోయి నాలుగు రూపాయలు వెనకేసుకోవచ్చని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. ఇంతలోనే అంతటి విపత్తు ముంచుకొస్తుందని కలలో కూడా ఊహించలేదు. తమ పంట పండిస్తుందనుకున్న ఏలేరు ఇలా మా ఆశలపై నీళ్లుచల్లి పోతుందని అనుకోలేదు. అసలు ఇంతటి విపత్తు ఈ మధ్య కాలంలో ఎప్పుడూ చూడ లేదు.' జిల్లాలో వరదలకు నష్టపోయిన రైతుల ఆక్రందనలు ఇవి.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఏలేరు సృష్టించిన విలయం నుంచి కోలుకుని బట్టకడతామంటే నమ్మలేకపోతున్నామని గుడ్లలో నీరు కుక్కుకుని రోదిస్తున్నారు. ఏలేరు ఆయకట్టు పరిధిలోని ఏ ప్రాంతంలో ఏ రైతును కదిపినా కన్నీళ్లే సమాధానం ఇస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా వేలాది ఎకరాలలో సిరులు కురిపిస్తూ వస్తున్న ఏలేరు జలాశయం ఈ సారి రైతులపై కన్నెర్రచేసి కకావికలం చేసింది. ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి ప్రకోపానికి ఏలేరు ఆయకట్టు రైతులకు కోలుకోలేని ఎదురు దెబ్బ తగిలింది. సుమారు 40 వేల మంది రైతులు దారీ తెన్నూ లేకుండా నడిసంద్రంలో చుక్కాని లేని నావలా ఏం చేయాలో పాలుపోక, సాయం చేసేవారు లేక దీనంగా చూస్తున్నారు. వారి బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి ఎంతో కొంత న్యాయం అందించే దిశగా 'సాక్షి' సామాజిక బాధ్యతగా తీసుకునే ప్రయత్నమే ఈ 'గ్రౌండ్ రిపోర్టు'. కిర్లంపూడి, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి మండలాల్లో ఏ గ్రామంలో చూసినా నేలనంటేసి కుళ్లిపోయిన పంట పొలాలే కనిపించాయి. ఆయా గ్రామాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా కనిపించింది.



వరద ముంపుతో గొల్లప్రోలు బైపాస్ రోడ్ లో పూర్తిగా దెబ్బతిన్న వరి పైరు



నవఖండ్రవాడలో ఏలేరు ముంపుతో దెబ్బతిన్న వరి పొలంలో రైతు

పాలకుల వైఫల్యమే..

ఏలేరు రిజర్వాయర్ ఏటా సుమారు 62 వేల ఎకరాల ఆయకట్టుకు ఊపిరి పోస్తోంది. నీటి యాజమాన్య పద్ధతులను పక్కాగా పాటించడం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి రెండు పంటలకు నీరు అందించింది. అటువంటి ఏలేరు రిజర్వాయర్‌కు వరదలు ముంచెత్తనున్నాయని ముందస్తు సంకేతాలున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రైతుల పొలాలన్నీ నట్టేట మునిగాయి. ఆయకట్టు పరిధిలో అటు పిఠాపురం, ఇటు జగ్గంపేట, మరో వైపు పెద్దాపురం ఇలా మూడు నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల్లో ఖరీఫ్ పంట వరద ముంపుతో కుళ్లిపోయి రైతులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో దాదాపు 80 శాతం పంట దెబ్బతింటే జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లో 30 శాతం పంట కోల్పోయి పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలిరా దేవుడా అంటూ రైతులు కుదేలైపోయారు.

సామర్లకోట మండలం వీకే రాయపురంలో నాలుగు ఎకరాల సొంత భూమితో పాటు, మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతు పరిస్థితి మరీ దయనీయం. మొత్తంగా 10 ఎకరాలు వ్యవసాయం చేస్తున్నాడు వెలమర్తి శ్రీనివాసు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా, పెట్టుబడి సాయం, సున్నా వడ్డీ.. ఇలా అన్ని విధాలా సాయం అందడంతో ధైర్యంగా సాగు చేస్తున్నామని ఆ గ్రామ రైతులు చెప్పుకొచ్చారు. కానీ ఈ సారి ఖరీఫ్‌లో ఎదురైన ఏలేరు విపత్తు వల్ల శ్రీనివాస్‌తో పాటు ఎంతో మంది రైతులు కుదేలయ్యారు. ఆ గ్రామంలో ఇలా వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న మరో 30, 40 మంది రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎందుకంటే గత ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట ఒకసారి నేలనంటేసి కుళ్లిపోయింది. ఇంకా సమయం ఉండడంతో రైతులు వ్యవసాయంపై ఆశ వదుకోలేక రెండో సారి అక్కడక్కడా అప్పులు చేసి వరి నాట్లు వేసుకున్నారు. అప్పటికే మొదటి సారి వేసిన పంట దెబ్బతినగా గుండె దిటవుచేసుకుని రెండోసారి నాట్లు వేస్తే ఈ సారి మొత్తానికే మోసం వచ్చిందని ఆ గ్రామంలో రైతులు గొల్లుమంటున్నారు. ఇలా దెబ్బమీద దెబ్బ తగలడంతో ఇక కోలుకోవడం కష్టమని కన్నీరు పెట్టుకున్నారు.

గండితో గుండెకోత

కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామం జువ్వల రమేష్ అనే రైతు రాజుపాలెంలో 50 ఎకరాలు సాగుచేస్తున్నాడు. రామకృష్ణాపురంలో ఏలేరు కాలువకు గండి పడి ఆ రైతు గుండె పిండేసింది. వరద నీరు వరి పంటను నిలువునా ముంచెత్తింది. రాజుపాలెంలో ఆ రైతు వేసిన 50 ఎకరాలతో పాటు మరో 400 ఎకరాల్లో వేసిన వరినాట్లు ముంపు నీటిలో మూడు రోజులుగా మగ్గిపోయి కుళ్లిపోయాయి. ఇలా ఆ రాజుపాలెం గ్రామంలోనే సుమారు 100, 150 మంది ఎకరం, రెండెకరాలు సాగు చేసుకుంటున్న చిన్న, సన్నకారు రైతులే. ఆ గ్రామంలో ఏ మూల ఏ ఆయకట్టుకు వెళ్లి ఏ రైతును కదిపినా ఎకరాకు రూ.25 వేలకు తక్కువ కాకుండా పెట్టిన పెట్టుబడి కళ్ల చూడకుండా వరదలో కొట్టుకుపోయిందని కన్నీరు పెడుతున్నారు. ఇంత నష్టం జరిగినా రైతులకు సాయపడి ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. పంట పోతే పోయింది కనీసం తెగిపోయిన కాలువ గట్లను పూడ్చడానికి కూడా ముందుకు రాకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా పూడ్చుకున్నారు. పంట నష్ట పరిహారం ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని చెప్పినా అది ఏమూలకూ రాదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

వరద నట్టేట ముంచేసింది



మాది పెద్దాపురం మండలం కట్టమూరు. ఏలేరు వరద వల్ల సుమారు రెండెకరాల వరకు పంట నష్టం వాటిల్లింది. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఇటీవల వరద ఉధృతికి చాలా నష్టపోయాను. ప్రభుత్వం ఎకరాకు పది వేల రూపాయలు ఇస్తే పెట్టుబడిలో సగం కూడా రాదు. రూ.25 వేలు ఇస్తేనే రైతులను ఆదుకున్నట్లు అవుతుంది.

– నల్లల గోవిందు, రైతు, కట్టమూరు, పెద్దాపురం మండలం

పొలం పూర్తిగా మునిగిపోయింది



నేను వ్యవసాయంపైనే ఆధారపడ్డాను. ఏలేరు మా కొంప ముంచేసింది. ఇంతలా విరుచుకుపడుతుందని అసలు కలలో కూడా ఊహించ లేదు. చూస్తుండగానే పొలం చెరువుగా మారిపోయింది. వరి దుబ్బులు కుళ్లిపోయి పనికిరాకుండా పోయాయి. కాయకష్టం చేసుకుని ఎకరం పొలం కౌలుకు చేసుకుంటున్నాను. చిరుపొట్ట దశకు చేరుకోవడానికి ఇంత వరకూ రూ.20 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం కాలువలపై దృష్టి పెట్టి ఉంటే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేది కాదు.

– మాదేపల్లి ఈశ్వరరావు, కౌలు రైతు, గొల్లప్రోలు

కాలువల ఆధునీకరణ లేదు



గత 20 ఏళ్లుగా ఏ ప్రభుత్వం కాలువల ఆధునీకరణ పట్టించుకోలేదు. ప్రభుత్వాలు మారినపుడు కాలువల ఆధునీకరణకు నిధులు మంజూరు చేశామని చెప్పడమే తప్ప పనులు పూర్తి చేసిన వారు ఎవరూ లేరు. కాలువలు ఆధునీకరించకపోవడం వల్లే వరద ముంపు ఏర్పడుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– మొగిలి వీరభద్రరావు, రైతు, గొల్లపోలు


ఏనాడూ ఇంత విపత్తు చూడలేదు



గడచిన 17 ఏళ్లుగా చేతిలో చిల్లిగవ్వ లేకున్నా రైతుల వద్ద నమ్మకంతో భూమి తీసుకుని కౌలుకు చేస్తున్నాను. ఏనాడూ ఏలేరుకు ఇంతటి వరద రాలేదు. పంట పొలాలతో పాటు దిబ్బలపై కూడా రెండు అడుగుల పైన నీరు వచ్చి నిలిచిపోయింది. వారం రోజులుగా వరద నీరు తగ్గలేదు. నాలుగున్నర ఎకరాలు భూమి కౌలుకు చేస్తున్నాను. ప్రతి ఎకరాపైనా పాతిక వేలు పైనే పెట్టుబడి పెట్టాను. అలా మొత్తం సాగు కోసం ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రూ.లక్షకు పైనే పెట్టుబడి పెట్టాను. కళ్లెదుటే ఆశల పంట నీటిపాలైంది. భవిష్యత్ ఏమిటో అర్థం కాకుండా ఉంది. ఈ అప్పులు ఎలా తీర్చాలో ప్రభుత్వం ఏ రీతిన సాయం చేస్తుందో అర్థం కావడం లేదు.

– మోర్తా నారాయణ, కౌలు రైతు, నవఖండ్రవాడ

నష్టపరిహారం వస్తుందో రాదో



ఏలేరు వరద వల్ల మా పంట పొలాలు పూర్తిగా నీటి మునిగాయి. మా రమణక్కపేటలో ఎక్కడ చూసినా పొలాలు చెరువు లను తలపిస్తున్నాయి. నేను 16 ఎకరాల భూమి కౌలుకు చేస్తున్నాను. ఒక్కొక్క ఎకరానికి 30 వేల రూపాయలు ఖర్చయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంట నష్టపోతే ఎకరానికి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు నష్టపరిహారం ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో ఎకరానికి రూ.పది వేలు ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ ప్రభుత్వం కాలవల ఆధునీకరణపై దృష్టి పెట్టకపోవడం వలన ఈ ముంపు సమస్య ఏర్పడింది.

– కూత చౌదరి, కౌలు రైతు, రమణక్కపేట

చిరుత కోసం రేయింబవళ్లు గాలింపు

- అసత్య ప్రచారాలను నమ్మొద్దు
- పులి దివాన్‌చెరువు అడవిలోనే ఉంది
- జిల్లా అటవీశాఖ అధికారి భరణి



రాజానగరం: చిరుతపులి కెమెరాలకు చిక్కకుండా, బోనులకు అందకుండా తిరుగుతోందని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ, పుష్కర వనాల మధ్య చిరుత సంచరిస్తున్న సంగతి తెలిసిన తరువాత తొమ్మిది రోజులుగా శాఖాపరంగా చేపట్టిన చర్యలను ఆమె వివరించారు. అటవీ ప్రాంతంలో కొన్ని కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు క్రూరమైన జంతువులను పట్టుకోవడంలో నిపుణులైన వారితో బృందాలుగా దానిని గాలిస్తున్నామన్నారు. వీటితో పాటు థర్మల్ డ్రోన్ కెమెరా కూడా ఉపయోగించి శోధిస్తున్నామన్నారు. కొన్నిచోట్ల కెమెరాలలో కనిపించిన దృశ్యాల ఆధారంగా అది దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్టులోనే ఉందని, దాని పాదముద్రలు కూడా గుర్తించామని అన్నారు. అయితే ఇంత వరకూ దాని వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. అలాగే పులి సంచారంపై జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆమె సూచించారు.

వైద్య విద్యకు ప్రైవేటు

- సామాన్యులకు దూరం చేస్తున్న సర్కార్
- మెడిసిన్ విద్యార్థుల్లో ఆందోళన
- కూటమి ప్రభుత్వంపై మండిపాటు



రంగరాయ వైద్య కళాశాల

కాకినాడ సిటీ: వేలాది పేద విద్యార్థుల మెడిసిన్ కలను రాష్ట్ర ప్రభుత్వం ఛిద్రం చేస్తోంది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వైద్య విద్య అభ్యసించాలనుకున్న వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేసే కుట్రలకు తెరతీసింది. గత ప్రభుత్వం నిర్మించి సిద్ధం చేసిన వైద్య కళాశాలల్లో వైద్య విద్య తరగతులు ప్రారంభమవుతాయని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆశలను కూటమి ప్రభుత్వం అడియాసలు చేసింది. ప్రభుత్వం తన నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రాష్ట్ర స్థాయి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరిస్తున్నారు.

విద్యార్థుల్లో ఆందోళన

ఇప్పటికే కొనసాగుతున్న వైద్య కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఆందోళన నెలకొంది. జిల్లాలో రంగరాయ మెడికల్ కళాశాలలో 150 సీట్లు, రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో 200 సీట్లు, అమలాపురం కిమ్స్ కళాశాలలో 150 సీట్లు ఏటా భర్తీ చేస్తున్నారు. గతేడాది ఈ సీట్ల సంఖ్య ఒక్కొక్క కళాశాలకు 50కి పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకూ జరిగిన కళాశాలల నిర్మాణాలకు అనుగుణంగా పీపీపీ విధానంలో నిర్వహణకు ప్రముఖ సంస్థలు ముందుకొస్తే వాటికి కళాశాలల నిర్వహణ బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు సూచించింది. ఇదే జరిగితే కొత్త వైద్య కళాశాలలన్నీ ప్రైవేటు పరం కావడం ఖాయమని, భారీ ఫీజులు చెల్లిస్తే కానీ సీటు దొరకని పరిస్థితి నెలకొంటుందని వైద్య విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



విద్యార్థులకు అశనిపాతం

నీట్ పరీక్ష రాసి ర్యాంకులు సాధించిన విద్యార్థులు సైతం కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో తక్కువ ఖర్చుతో మెడిసిన్ పూర్తి చేయాలని పేదింటి విద్యార్థులు పెట్టుకున్న ఆశలపై రాష్ట్ర ప్రభత్వం నీళ్లు చల్లింది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు కోసం ఏళ్ల తరబడి శిక్షణ తీసుకుని నీట్ పరీక్ష రాసి సీటు సంపాదించుకుంటే, ఇప్పుడు వాటిలో సీట్లు తగ్గించి వారి ఆశలను అడియాసలు చేసిందని విద్యార్థుల తల్లిదండ్రులు సైతం విరుచుకుపడుతున్నారు.

చాలా బాధాకరం



ఎంబీబీఎస్ చదవడం ఎంతో మంది కల. రాష్ట్రంలో అరకొరగా ఉన్న మెడికల్ సీట్లతో వైద్య విద్య ఉన్నత వర్గాలకే పరిమితమైంది. మధ్య తరగతి పిల్లలు వైద్య విద్య కోసం ఎన్నో ఇబ్బందుల నడుమ విదేశాలకు వెళ్తున్నారు. గత సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీంతో సొంత రాష్ట్రంలో ఎంతో మందికి ఎంబీబీఎస్ చదివే అవకాశం వస్తుందని సంతోషపడ్డాం. దీనిని అడ్డుకుని ప్రైవేట్ పరం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇది చాలా బాధాకరం.

– ఎ.రవిచంద్ర, నీట్ రాసిన విద్యార్థి, కాకినాడ

నారాయణ, ఎన్‌ఆర్‌ఐల కోసమే



వైద్య విద్యను ప్రైవేటుపరం చేయడమంటే మంత్రి నారాయణ, ఎన్‌ఆర్‌ఐల కోసమేనని అర్థమవుతోంది. ప్రభుత్వ ఆరోగ్య విద్యని నెలకొల్పుతామని, గత ప్రభుత్వం కన్నా మంచి చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మోసం చేసింది. వైద్య విద్య ప్రైవేటీకరణ అజెండా ఆపకపోతే ఆందోళనలు చేస్తాం.

– ఎస్.కిరణ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పీడీఎస్‌యూ

క్లుప్తంగా

స్టాఫ్ నర్సులు ఆందోళన చెందవద్దు

ఏపీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి

కాకినాడ క్రైం: జీఓ నంబరు 115ను అనుసరించి ఏఎన్ఎంలను రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా నియమించే అవకాశం లేదని, ఈ విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ తనకు స్పష్టం చేశారని ఏపీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. జీఓపై కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు. శనివారం కాకినాడకు వచ్చిన ఆయనను ఏపీ స్టేట్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ అధ్యక్షురాలు మామిడి చిన్నారి ఆధ్వర్యంలో నర్సింగ్ ఆఫీసర్లు ఏపీఎన్జీవో హోంలో కలిశారు. ఈ సందర్భంగా జీఓ నంబరు 115పై తమ ఆందోళన వెళ్లబుచ్చారు. స్పందించిన శివారెడ్డి నూతన వైద్య కళాశాలల ఏర్పాటు నేపథ్యంలో నర్సింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి మాత్రమే ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చి నర్సింగ్ సేవల్లో నియమించారని, అది స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ కోసం కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇందుకు వారికి అందుతున్న జీతానికి అదనంగా మరో రూ.5 వేలు గౌరవ వేతనాన్ని ఇస్తున్నారన్నారు. ఏఎన్ఎంలను రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా నియమిస్తున్నట్లు ఆదేశాలేవీ ఆ జీఓలో లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ఖాళీ స్టాఫ్ నర్సు పోస్టుల్లో ఏ ఒక్కటీ ఏఎన్ఎంలతో భర్తీ కాబోదని కాంట్రాక్టు నర్సులకు ధైర్యం చెప్పారు. శివారెడ్డితో పాటు ఏపీఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తమ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసులేటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి వెంకట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు ఉన్నారు. వీరిని కలిసిన వారిలో స్టాఫ్‌నర్సులు శ్రీనివాస్, సత్యసింధు, సుందరి, క్రిష్టీ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం సీజ్

నిడదవోలు రూరల్: విజ్జేశ్వరం శివారు కృష్ణసాయి రైస్‌మిల్లులో 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం సీజ్ చేసి, 6–ఏ కేసు నమోదు చేసినట్లు నిడదవోలు సివిల్ సప్లయిస్ డీటీ ఎం.అనిల్‌కుమార్ తెలిపారు. విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులకు వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించగా, ఆకుల పేర్రాజు అనే వ్యక్తి తన వాహనంపై రేషన్ బియ్యం తీసుకువచ్చి రైస్ మిల్లులో విక్రయించాడని తేలింది.

ఈ మిల్లులో రూ.1.20 లక్షల విలువైన 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించారు. మిల్లు యజమాని ముళ్లపూడి గోపాలకృష్ణ, నిందితుడు ఆకుల పేర్రాజుపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, విజయ్‌కుమార్, జీవానందం, శివ తదితరులు పాల్గొన్నారు.



విజ్జేశ్వరంలో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన సివిల్ సప్లయిస్, విజిలెన్స్ అధికారులు

బరువులెత్తుతాం... సత్తా చాటుతాం

- అమలాపురంలో రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు
- 400 మంది క్రీడాకారులు హాజరు

అమలాపురం టౌన్: బరువులెత్తుతాం.. సత్తా చాటుతాం అంటూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పవర్ లిఫ్టర్లు పోటాపోటీగా తలపడ్డారు.. తమలోని ప్రతిభ చాటేందుకు సాయశక్తులా ప్రయత్నించారు. ఎంతో ఉత్కంఠగా సాగిన ఈ పోటీలకు అమలాపురం వేదికైంది. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 11వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024 పోటీలు స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో శనివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. శని, ఆదివారాల్లో జరిగే ఈ పోటీలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరై బరువులెత్తి తమ సత్తా చాటారు. సబ్ జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో పురుష, మహిళా క్రీడాకారులు పాల్గొని క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్, స్క్వాట్ లిఫ్ట్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అనుబంధంగా ఈ రాష్ట్ర స్థాయి పోటీలు హైదరాబాద్, విశాఖపట్నం మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ సౌజన్యంతో జరుగుతున్నాయి. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు, హెల్త్ ఫిట్‌నెస్ జిమ్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. పవర్ లిఫ్టర్‌లు వివిధ కేటగిరీల్లో 100 కిలోల బరువు నుంచి 200 కిలోల వరకూ ఎత్తి సత్తారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 61 మంది లిఫ్టర్లు పాల్గొంటే, ఇతర జిల్లాల నుంచి అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లా నుంచి 55 మంది పాల్గొన్నారు. తర్వాత గుంటూరు జిల్లా నుంచి 40 మంది హాజరయ్యారు. రెండో రోజు ఆదివారం జరిగే పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మరో 150 మంది వరకూ రానున్నారని జిల్లా అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జి.వెంకటేశ్వర్లు (జగ్గయ్యపేట), ఎస్.కోటేశ్వరరావు (విశాఖపట్నం), ఏవీ ప్రసాద్ (బాపట్ల), సత్యనారాయణ (రాజమహేంద్రవరం), సూర్యనారాయణ (విశాఖపట్నం), డి.అనూజ (ఎన్టీఆర్ జిల్లా), ఈవీఎస్ శివకుమార్ (విశాఖపట్నం), హెచ్.గణేష్ (విశాఖపట్నం) వ్యవహరించారు. రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొమ్మేటి వెంకటరమణ, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి శేఖర్‌లు పాల్గొని క్రీడాకారులకు సహకారం అందించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు పప్పుల శ్రీరామ చంద్రమూర్తి పాల్గొన్నారు.



రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తొలి రోజు విజేతలైన మహిళా లిఫ్టర్లతో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయ నిర్ణేతలు



పోటీల్లో బరువులెత్తి సత్తా చాటుతున్న ఓ మహిళా పవర్ లిఫ్టర్

జాతీయ పోటీల్లో పాల్గొన్నా..



నేను ఇప్పటి వరకూ పది జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నాను. మొత్తం 9 పతకాలు సాధించాను. వరల్డ్ చాంపియన్ షిప్, యూనివర్సిటీ చాంపియన్ షిప్, స్ట్రాంగ్ వుమెన్ ఇలా పలు విజయాలు సొంతం చేసుకున్నా. మా నాన్న ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్, ఆయన స్ఫూర్తితోనే ఈ క్రీడలో సుస్థిర స్థానం సాధించే దిశగా శ్రమిస్తున్నా.

–సాదియా, ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్, మంగళగిరి, గుంటూరు జిల్లా

గుర్తింపు తెచ్చుకోవాలని..



నేను ఇప్పటి వరకూ ఐదు ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నా. ఒక బంగారు పతకం సాధించాను. అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టర్‌గా గుర్తింపు తెచ్చుకోవాలనే దిశగా శ్రమిస్తున్నాను. ఇప్పుడు అమలాపురంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాను. పవర్ లిఫ్టింగ్ పోటీలు ఎక్కడ జరుగుతున్నా వాటికి నేను హాజరవుతున్నా.

–మురళీకృష్ణ, ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా

సంస్కృతికి వేదాలు పట్టుగొమ్మలు



గంగలకుర్రులో వేద సభ నిర్వహిస్తున్న ఘనాపాఠీలు

అంబాజీపేట: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు, ధర్మాలకు వేదాలు పట్టుగొమ్మలుగా నిలుస్తున్నాయని తెనాలికి చెందిన ప్రముఖ వేదపండితులు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు, రాజమహేంద్రవరానికి చెందిన విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రిలు, టి.టి.డి.కు చెందిన వేదిక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దువ్వూరి ఫణియజ్ఞేశ్వర సోమయాజులు ఉద్ఘాటించారు. గంగలకుర్రులో జయంతి భాస్కరసుబ్రహ్మణ్యం తన తండ్రి నరసింహమూర్తి జ్ఞాపకార్థం 23వ వేదశాస్త్ర విద్వత్ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ యజుర్వేదానికి చెందిన 150 మంది రుగ్వేద, అథర్వణ వేదం, సామవేదానికి చెందిన మరో 150 మంది వేద పండితులు నిర్వహించిన వేద ఘోషతో దద్దరిల్లింది. వేద పఠనంతో లోకానికి, దేశానికి ఎంతో మంచి జరుగుతుందని ఆంజనేయ చయనులు అన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రజలు అపమృత్యు దోషాలతో కాలం చేస్తున్నారని, వారికి వేద పఠనం అమృతంలా పని చేస్తుందన్నారు. హోమం చేస్తే ఎంత ఫలితం లభిస్తుందో వేదస్వస్తి వింటే సామాన్యులకు సైతం పూర్తి ఫలితం లభిస్తుందన్నారు. ఈ వేద సభలో శ్రీపాద మాణిక్యావధాన ఘనాపాఠీ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు పాల్గొన్నారు. తొలుత కర్రా దత్తు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు కోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ

అమలాపురం టౌన్: శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధ్వర్యంలో అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో 62వ వేద విద్వత్సత్కార సభ ఆదివారం జరుగనుంది. ఏటా వామన జయంతి రోజున వేదశాస్త్ర సన్మాన సభ వార్షికోత్సవాన్ని ఉభయ రాష్ట్రాల స్థాయిలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వేదాలు, వేద పండితులను ప్రోత్సహిస్తూ వేదసభను ఈ సంస్థ నిర్వహిస్తూ వస్తోంది. ఈ సభకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 200 మంది వేద ఘనాపాఠీలు, వేద పండితులు అమలాపురానికి వస్తారని ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గుళ్లపల్లి ప్రభాకర ఫణిరాజా, గుళ్లపల్లి వెంకట్రామ్ తెలిపారు. కడియాల వెంకట సత్యనారాయణ ఘనాపాఠి అధ్యక్షతన జరుగనున్న ఈ సభ వేదాధ్యయనం చేసి వేదాల మనుగడను కాపాడడమే కాకుండా వేదాలసారం భవిష్యత్ తరాలకు అందించే దిశగా వేద చర్చ జరుగనుంది. సాయంత్రం 3 గంటల నుంచి పండితోపన్యాసంతో వేద సభ మొదలవుతుంది. అనంతరం వందలాది వేద పండితులు ఏక కంఠంతో లోక కల్యాణార్థం వేద స్వస్తి, ఆశీర్వచనం నిర్వహిస్తారు. చివరిగా శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ ఆధ్వర్యంలో వేద పండితులకు సామూహిక సత్కారాలు జరుగుతాయి. వేదసభకు కోనసీమలోని వేదాభిమానులు తరలిరావాలని ఆ సంస్థ కార్యదర్శి గుళ్లపల్లి వెంకట్రామ్ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాసుపత్రుల్లో పోస్టులు భర్తీ చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో అధికారులతో సమీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు సరిపడా వైద్యులు లేరని, త్వరలోనే ఆ పోస్టులను భర్తీ చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిని ఆయన శనివారం సందర్శించారు. ఆసుపత్రి వైద్యాధికారులు, వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించనున్నామని తెలిపారు. వైద్య సేవల్లో మెరుగైన చికిత్స విధానాలు, మౌలిక సదుపాయాల కల్పనలో పలు మార్పులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైందని, వైద్య సేవలు అందించే వారు పరిమితులకు లోబడి పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే లోటుపాట్లను అధిగమించేందుకు మార్పు తీసుకురావడంలో వైద్యులంతా కలిసి పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల కాలంలో మూడు శిశు మరణాలు సంభవించడం ఎంతో బాధను కలిగించిందన్నారు. నిర్లక్ష్యం వల్ల ఏ ఒక్క ప్రాణం కూడా పోవడానికి వీలులేదన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వహణ వ్యవస్థ, వైద్య సేవలు అందించే క్రమంలో రోగులకు ఎదురవుతున్న సమస్యలను యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. బయటి వ్యక్తుల ద్వారా రోగులు దోపిడీకి గురవుతున్నారని, ఈ సమస్య పరిష్కరిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మార్చురీ గదిలో ఫీజర్స్ ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసి, అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ, రోగులను దోచుకుంటున్నారన్నారు. వాటిని నియంత్రించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీ సూర్యప్రభ ఆసుపత్రి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు.

ఏపీఎంఎస్ఐడీసీ డివిజనల్ ఇంజినీర్ కృష్ణారావు వైద్య కళాశాల భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాలు, వచ్చే విద్యా సంవత్సరానికి చేపట్టనున్న పనుల వివరాలను తెలియజేశారు. కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు



అంతర్వేది ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు మూడో రోజు కొనసాగాయి. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహ వచనంతో అర్చకులు పవిత్రోత్సవాలను ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయంలోని పురాతన కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఆశీనులు చేశారు. పంచ సూక్తాలతో స్వామివారికి అర్చకులు అభిషేకం చేశారు. సర్వ దైవత్య హోమం, పంచసూక్తాలతో హోమం, మహా శాంతి హోమం నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాలరాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

తుని: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక జీఆర్పీ హెచ్ కానిస్టేబుల్ జి.మోహన్ శనివారం తెలిపారు. ఆ వివరాల్లోకెళ్తే.. సుమారు 40 ఏళ్ల వ్యక్తి రైలులో ప్రయాణిస్తూ తుని, గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య జారిపడి మృతి చెందాడు. మృతుడు నాచురంగుపై తెలుపు చుక్కలు కలిగిన చొక్కా, ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఇతని చేతిపై బెంగాలీ భాషలో పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 19020 నంబరులో సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న దేవ నర్తకి నాటకం

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామంలో కర్షక గణపతి నవరాత్ర ఉత్సవాల వేదికపై శుక్రవారం సాయంత్రం జరిగిన దేవ నర్తకి నాటక ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. ప్రముఖ సినీ హాస్య, జబర్దస్త్ నటుడు అప్పారావు, కడప రత్నశ్రీ కాంబినేషన్‌లో నాటకాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. నాటకాన్ని చూడటానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా నటుడు అప్పారావు మాట్లాడుతూ ప్రస్తుతం నాటకాలకు ఆదరణ తగ్గుతుందని, ప్రతి ఒక్కరూ నాటకాలను, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం కూనవరం గ్రామస్తులు కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ఒక్క మాత్రతో నులిమేద్దాం..

- ఆల్బెండజోల్‌తో రక్తహీనతకు చెక్
- 17న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

రాయవరం: నులి పురుగు.. ఈ మాట వినడానికి చిన్నగానే ఉన్నా మనిషికి కలిగించే అనారోగ్యం పెద్దదే. చిన్నారుల్లో రక్తహీనతకు, రోగాలకు కారణమవుతున్న నులి పురుగుల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నాయి. ఈ ఏడాది కూడా ఈ నెల 17న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. 2024–25 విద్యా సంవత్సరంలో మొదటి విడత ఆల్బెండజోల్ మాత్రలను ఒకటి నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు అందజేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3,04 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రతి పీహెచ్‌సీకి అదనంగా 10 శాతం మాత్రలను బఫర్ స్టాక్‌గా పంపించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం

నులి పురుగులు చిన్నారుల ఆరోగ్యంపై అధిక ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ముఖ్యంగా రక్తహీనత, పోషకాల లోపం బారిన పడతారు. చిన్నారుల కడుపులో కొంకి, నులి, బద్దె, గుండ్రని పురుగులు పెరిగితే అవి రక్తాన్ని పీల్చేస్తాయి.

ఆ పురుగుల పునరుత్పత్తి, ఎదుగుదల మొత్తం జీర్ణ వ్యవస్థలో జరగడంతో మనం తీసుకునే ఆహారాన్ని ఆ పురుగులు శోషించుకుంటాయి. ఫలితంగా పదేళ్ల వయసున్న వాళ్లలో ఎక్కువగా రక్తం లేకుండా బాధపడడం, పౌష్టికాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, వాంతులు, అతిసారం, మలంలో రక్తం పడడం తదితర వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. దీనిని అరికట్టేందుకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలి.

కోనసీమ జిల్లాలో ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ ప్రథమ సంవత్సరం, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తారు. కోనసీమ జిల్లాలో 3,948 వివిధ విద్యా సంస్థల్లో 3,04,018 మందికి డీవార్మింగ్ మాత్రలు మింగించడమే లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలోని 1,726 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,036 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 97 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, 53 డిగ్రీ కళాశాలలు, 36 ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలు, ఏడు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తారు.



డీవార్మింగ్ మాత్రలు మింగిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

మాత్రలు వేసుకునే విధానం

ఏడాది లోపు వారికి, తీవ్రమైన అనారోగ్యం కలిగి ఉన్నవారికి ఈ మాత్రలు ఇవ్వరాదు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తీసుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల నులి పురుగుల నిర్మూలన జరిగి, రక్తహీనత దూరం అవుతోంది. ఒకటి నుంచి రెండేళ్ల లోపు పిల్లలు సగం ఆల్బెండజోల్ మాత్రను (200 ఎంజీ), రెండేళ్లకు పైబడిన వారు ఒక మాత్ర(400 ఎంజీ) తీసుకోవాలి.

మధ్యాహ్నం భోజనం చేశాకే..



ఆల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలి. మాత్రలను చప్పరించడం లేదా నమిలి మింగడం చేయాలి. మధ్యాహ్న భోజనం తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కున్న అనంతరం తీసుకోవాలి. మాత్రలు తీసుకున్న తర్వాత ఏ విధమైన ఇబ్బందులు ఎదురైనా వెంటనే దగ్గరలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలి.

–జాన్‌లెవి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, అమలాపురం

విజయవంతం చేయాలి



జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఈ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాం. ఈ నెల 17న మాత్రలు వేసుకోని వారు తప్పనిసరిగా ఈ నెల 25న మ్యాపింగ్ అఫ్ ప్రోగ్రామ్‌లో డీవార్మింగ్ మాత్రలు తీసుకోవాలి. 4–6 నెలల గర్భిణులు కూడా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలి.

–డాక్టర్ దుర్గారావుదొర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, అమలాపురం